# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 352 | పేజీలు: 4 | వెల: 4/- | ఆదివారం ● 07, జూలై 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి




## 22 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

- ఆగస్టు 12 వరకు బడ్జెట్ సమావేశాలు
- 23న బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న నిర్మలా సీతారామన్
- వివరాలు వెల్లడించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు

**న్యూఢిల్లీ,జూలై6(నమస్తే ఉదయం):** సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో విజయం సాధించి, నరేంద్రమోదీ నేతృత్వంలో మూడోసారి ఎన్డీయే

మిగతా.. 2లో



# ఫ్రెండ్లీగా పరిష్కరించుకుందాం..

- ముగిసిన సిఎంల స్థాయి భేటీ
- విభజన సమస్యలపై రెండు కమిటీల ఏర్పాటు
- మంత్రులతో ఒకటి, అధికారులతో మరోటి ఏర్పాటు
- అనేక అంశాలతో పాటు, ఐదుగ్రామాల విలీనంపై చర్చలు
- విభజన అంశాలపై రోడ్ మ్యాప్ ఖరారు
- మరోమారు భేటీకి ఇరు రాష్ట్రాల సిఎంల అంగీకారం

**హైదరాబాద్,జూలై6(నమస్తే ఉదయం):** విభజన సమస్యల పరిష్కారమే అజెండాగా హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం ముగిసింది. దాదాపు రెండు గంటలపాటు సాగిన భేటీలో పది కీలక అంశాలపై ముఖ్యమంత్రులు చర్చించారు. సమస్యల పరిష్కారానికి మంత్రులతో ఒక కమిటీ, అధికారులతో మరో కమిటీ వేయాలని నిర్ణయించినట్టు సమాచారం. ముఖ్యంగా ఇరు రాష్ట్రాల



ప్రయోజనాలకు భంగం కలగకుండా పరిష్కారాలు ఉండాలని సమావేశంలో నిర్ణయించారు. పెండింగ్ సమస్యల పరిష్కారంపై ఇద్దరు ముఖ్యమంత్రులు అధికారుల సూచనలు తీసుకున్నారు. న్యాయపరమైన చిక్కులపై కూడా చర్చించారు. షెడ్యూల్ 10లోని అంశాలపైనే ప్రధానంగా చర్చ జరిగింది. నిర్ణీత వ్యవధిలో సమస్యలు పరిష్కరించుకోవాలనే ఏకాభిప్రాయానికి ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు వచ్చినట్టు తెలిసింది.తెలంగాణ నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీఎస్ శాంతి కుమారి పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు మంత్రులు అనగాని సత్యప్రసాద్, బి.సి.జనార్దన్‌రెడ్డి, కందుల దుర్గేష్, సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్, ఇతర అధికారులు హాజరయ్యారు.ప్రధానంగా చర్చించిన అంశాల్లో ఇవి ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టం షెడ్యూలు 9, 10లో పేర్కొన్న సంస్థల ఆస్తుల పంపకాలు. విభజన చట్టంలో పేర్కొనని సంస్థల ఆస్తుల పంపకాలు. ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ అంశాలు. పెండింగ్ విద్యుత్తు బిల్లులు, విదేశీ రుణసాయంతో ఉమ్మడి రాష్ట్రంలో 15 ప్రాజెక్టులు నిర్మించారు. వాటి అప్పుల పంపకాలు. ఉమ్మడి సంస్థలకు చేసిన

మిగతా.. 2లో



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వేంకటేశ్వర స్వామి ప్రతిమను బహుకరిస్తున్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు



కాళోజీ రచించిన 'నా గొడవ' పుస్తకాన్ని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు బహుకరిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



# నేడు గోల్కొండ బోనాలు

- భారీగా ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం
- భారీగా పోలీసు బందోబస్తు
- బోనాల ఏర్పాట్లకు మంత్రుల నిధులు విడుదల
- ఆలయాలకు చెక్కులు పంపిణీ చేసిన మంత్రులు

**హైదరాబాద్,జూలై6(నమస్తే ఉదయం):** తెలంగాణలో ఆషాఢ బోనాల పండుగను ఎంతో భక్తితో చేసుకుంటారు. ఆదివారం గోల్కొండ బోనాలతో పండగలు ప్రారంభం అవుతాయి. తరవాత సికిందరాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి బోనమెత్తు తారు. తరవాత పాతబస్తీ లాల్‌దర్వాజ అమ్మవారి బోనాలు వరుస ఆదివారాల్లో జరుగుతాయి. గోల్కొండ బోనాల జాతర ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. కోటలోని అమ్మ వారికి తొలి బోనం సమర్పించడంతో ప్రారంభ మయ్యే ఈ వేడుక సిటీలో దాదాపు నెల రోజుల పాటు జరగనుంది. కోటలోని అమ్మవారికి తొటెల, ఫలహార బండ్ల ఊరేగింపులు, రంగం, బలిగంప ఊరేగింపు వంటి వాటితో నగర వీధులు కోలాహలంగా మారనున్నాయి. ఈ నెల 14న సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి, 21న లాల్ దర్వాజ శ్రీ సింహవాహిని అమ్మవారికి యాత్రికులు బోనాలు సమర్పిస్తారు. తిరిగి గోల్కొండ కోటలో బోనాల సమర్పణతో వేడుక ముగియనుంది. జాతర ప్రారంభ సూచికగా జగదాంబిక అమ్మవారి ఆలయ మార్గంలోని మెట్లకు స్థానికులు శుక్రవారం పూజలు చేశారు. సిటీలో అత్యంత వేడుకగా జరిగే బోనాల జాతర కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు చెప్పారు. సిటీలోని అమ్మవారి ఆలయాలను అందంగా ముస్తాబు చేసినట్లు వెల్లడించారు. సంబరాలు ప్రశాంతంగా జరిగేలా పలు సెన్సిటివ్ ఏరియాలలో బలగాలను మోహరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆషాడ మాసంలో బోనాల శోభతో రాష్ట్రమంతట కూడా అమ్మవారి ఆలయాల్లో ఆదివారం, గురువారం బోనాలను సమర్పిస్తారు. ఈ నేపథ్యంలో ఈసారి కూడా బోనాల పండుగ ఆదివారం జులై 7 నుంచి ప్రారంభం కానుంది. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను రాష్ట్ర, దేశవ్యాప్తంగా నిలిచేలా ఉత్సవాలు నిర్వహించాలని సీఎం ఆదేశించారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శనివారం బేగంపేట హోటల్ హరితా టూరిజంప్లాజాలో ఆషాఢ మాసం బోనాల దశాబ్ద ఉత్సవాలు 2024కి సంబంధించిన దేవాలయాల కమిటీలకు

మిగతా.. 2లో

# నీట్ యూజి కౌన్సిలింగ్ వాయిదా

**తదుపరి ఉత్వర్వులు ఇచ్చేవరకు నిలిపివేత**

**న్యూఢిల్లీ,జూలై6(నమస్తే ఉదయం):** వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజీ 2024 పరీక్షలో అక్రమాల వ్యవహారం తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ వివాదం వేళ నీట్ యూజీ కౌన్సెలింగ్‌ను జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ వాయిదా వేసింది. వాస్తవానికి ఈ కౌన్సెలింగ్ పక్రియ శనివారం నుంచే ప్రారంభం కావాల్సి ఉండగా.. తదుపరి నోటీసులు ఇచ్చేంత వరకు దాన్ని వాయిదా వేస్తున్నట్లు

మిగతా.. 2లో





## ఇక ఏటా రెండుసార్లు టెట్

- ఉత్తర్వులు జారీచేసిన విద్యాశాఖ

**హైదరాబాద్,జూలై6(నమస్తే ఉదయం):** టీచర్ పోస్టులకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు టీ సర్కార్ వెసులుబాటు కల్పించింది. ఇప్పటినుంచి ఏడాదికి రెండుసార్లు టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) నిర్వహిస్తామని తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అధికారంగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి ఏడాది జూన్‌లో ఒకసారి, డిసెంబర్‌లో ఒకసారి టెట్ పరీక్ష నిర్వహించనున్నారు. మరోవైపు ఒక అభ్యర్థి ఎన్నిసార్లు అయినా టెట్ ఎగ్జామ్ రాసుకోవచ్చని ఉత్తర్వుల్లో తెలియజేసింది. టెట్ పరీక్ష పాస్ అయిన వారు మాత్రమే డీఎస్సీ రాసేందుకు అవకాశం కల్పించనున్నారు. టెట్ మార్కులను డీఎస్సీలో వెయిటేజీగా ఇవ్వనున్నారు.

# రసాభాసగా గ్రేటర్ కార్పోరేషన్ సమావేశం

- బిజెపి, బిఆర్ఎస్ కార్పోరేటర్ల ఆందోళన
- మేయర్ పోడియం చుట్టుముట్టి రాజీనామాకు డిమాండ్
- ప్లకార్డులు ప్రదర్శించిన బిఆర్ఎస్ కార్పోరేటర్లు

**హైదరాబాద్,జూలై6(నమస్తే ఉదయం):** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తొమ్మిదో కౌన్సిల్ సమావేశం రసాభాసగా మారింది. బీఆర్ఎస్ ,బీజేపీ కార్పొరేటర్లు సమావేశం ప్రారంభానికి ముందే ప్రధాన కార్యాలయం ఆవరణలో ఆందోళనకు దిగారు. అనంతరం శనివారం ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం కాగా.. నిరసనలతో కొద్ది నిమిషాల్లోనే మీటింగ్ గందగోళంగా మారింది. బీఆర్ఎస్ కార్పొరేటర్లు మేయర్ పోడియాన్ని చుట్టుముట్టారు. ఆమె పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని.. మేయర్ రాజీనామా చేయాలని

మిగతా.. 2లో



# సికింద్రాబాద్-గోవా మధ్యనేరుగా బైవీక్లీ

- రైల్వే శాఖ నిర్ణయంపై కిషన్ రెడ్డి కృతజ్ఞతలు

**హైదరాబాద్,జూలై6(నమస్తే ఉదయం):** తెలుగు రాష్ట్రాలనుంచి గోవా వెళ్లే ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు చెప్పింది. సికింద్రాబాద్ నుంచి వాస్కోడ గామా(గోవా) వెళ్లేందుకు కొత్త ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించ నుంది. దీంతో ఇక నేరుగా గోవాకు సర్వీస్ అందుబాటులోకి రానుంది. రైల్వేశాఖ నిర్ణయంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కృతజ్ఞతు తెలిపారు. ఇప్పటివ రకు వారానికి ఒక రైలు 10 బోగీలతో సికింద్రాబాద్ నుంచి బయలుదేరి గుంతకల్ చేరుకుని అక్కడ తిరుపతి నుంచి గోవాకు వెళ్లే మరో 10 బోగీలతో కలిపి ఒక నూతన రైలుగా మారి గోవాకు ప్రయాణం సాగించేది. ఇది కాకుండా కాచిగూడ - యలహంక

మిగతా.. 2లో







## ప్రభుత్వ సలహాదారుగా కెకె

- కేబినేట్ ర్యాంక్ కల్పిస్తూ ఉత్తర్వులు

**హైదరాబాద్,జూలై6(నమస్తే ఉదయం):** మాజీ ఎంపీ, సీనియర్ నేత కే.కేశవరావు ప్రభుత్వ సలహాదారుగా నియమితులయ్యారు. ఆయనకు కేబినెట్ హోదా కల్పిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. బీఆర్ ఎస్ పార్టీలో సీనియర్ లీడర్ గా, కేసీఆర్ కు సన్నిహితుడిగా కొనసాగిన కేకే .. ఈ మధ్యే ఎఐసిసి చీఫ్ మల్లికార్జున ఖర్గే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. తర్వాత రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. కేకే కూతురు జిహెచ్ఎంసి మేయర్ గా ఉన్న గద్వాల్ విజయలక్ష్మి కూడా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన సంగతి తెలిసిందే. కెకె రాజ్యసభ ఎంపీగా తన పదవీకాలం ఇంకా రెండేండ్లు మిగిలి ఉండగానే

మిగతా.. 2లో



# నియోజకవర్గానికో నాలెడ్జ్ సెంటర్

- యువతకు స్కిల్ శిక్షణ కోసం ఏర్పాటు
- బడ్జెట్ సన్నాహక సమావేశంలో డిప్యూటి సిఎం
- సీతక్కతో కలసి సమీక్షించిన భట్టి విక్రమార్క
- మిషన్ భగీరథ నిధుల దుర్వినియోగంపై ఆరా
- ప్రతి ఆవాసానికి మంచినీరు అందించాలని ఆదేశాలు

**హైదరాబాద్,జూలై6(నమస్తే ఉదయం):** రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లను ప్రారంభించనున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి మల్లు విక్రమార్క అన్నారు. ఇసచివాలయంలో మంత్రి సీతక్కతో కలిసి బడ్జెట్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షల కోచింగ్‌కు నిపుణులైన వారితో ఉచితంగా గ్రామీణ యువతకు శిక్షణ ఇప్పిస్తామన్నారు.

నాలుగు నెలల్లో ఈ నాలెడ్జ్ సెంటర్ల నిర్మాణాలు పూర్తవుతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలన్నారు. యువత ఉపాధి లేక ఇబ్బందులుపడుతున్నారన్నారు. ఫీజు రీయింబ్స్‌మెంట్ పథకం అందుబాటులోకి వచ్చాకి వేలాది మంది బీటెక్ పూర్తి చేసి స్కిల్స్ లేక గ్రామాల్లోనే ఉండిపోతున్నారన్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను పాత

మిగతా.. 2లో



సీఎం రేవంత్ రెడ్డికి పుష్పగుచ్చం అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి



ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

# సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

**గద్వాల అభివృద్ధి కోసం సహకరించండి ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి**

**సీఎం రేవంత్ రెడ్డిని కోరిన ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై6(నమస్తే ఉదయం):** గద్వాల నియోజకవర్గంలో పెండింగ్ పనులను పూర్తి అయ్యే విధంగా సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరినట్టు ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి తెలిపారు. శనివారం హైదరాబాద్ లోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీ లోకి సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో పార్టీ మారడం జరిగింది. ఈ సందర్బంగా ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి సీఎం రెవంత్ రెడ్డికి గద్వాల నియోజకవర్గం లోని పెండింగ్ ప్రాజెక్టలు పూర్తి ఐయ్యేందుకు సహకరించాలని, నెట్టంపాడు ప్రాజెక్ట్ కింద ఉన్న ర్యాలంపాడు రిజర్వాయర్ ఆనకట్ట నాణ్యత లేక నీరు లీకు అవుతుందని రిజర్వాయర్ ను నాలుగు టీఎంసీ నిలువ చేసేందుకు ఆనకట్ట మరమ్మతులకు సహకరించాలని, అదే విధంగా గట్టు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ త్వరగతిన పూర్తి చేసేందుకు నిధులు ఇవ్వవలసిందిగా కోరడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి గద్వాల అభివృద్ధికి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు.అదే విధంగా సోమవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ప్రత్యేకంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇర్రిగేషన్ శాఖపై ఉమ్మడి జిల్లా ప్రాజెక్ట్ లపై రివ్యూ చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు.

ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణా రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే లుదానం నాగేంద్రం, యెన్నం శ్రీనివాస్ రెడ్డి,ఎంపీ మల్లు రవి తదితరులు పాల్గొన్నారు.

# హాథ్రస్ ఘటన దిగ్భ్రాంతి కలిగించింది

## మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

## మీడియా ముందుకు వచ్చిన భోలే బాబా

**న్యూఢిల్లీ,జూలై6(నమస్తే ఉదయం):** ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగిన హాథ్రస్ తొక్కిసలాట ఘటన యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన సంగతి తెలిసిందే. దాంతో 'భోలే బాబా పేరు దేశమంతా మార్మోగిపోయింది. ఈ నేపథ్యంలో ఆయన తొలిసారి మీడియా ముందుకు వచ్చారు. ఆ దుర్ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. 'జులై 2 ఘటనతో మేం చాలా వేదనకు గురయ్యాం. ఈ క్లిష్ట సమయంలో ఆ భగవంతుడు బాధను భరించే శక్తిని ఇవ్వాలని





ప్రార్థిస్తున్నాను. తొక్కిసలాటకు బాధ్యులైన వారు శిక్ష నుంచి తప్పించుకోలేరని నేను నమ్ముతున్నాను. నాకు ప్రభుత్వంపై విశ్వాసం ఉంది. మృతులు, గాయపడిన కుటుంబాలకు అండగా ఉండాలని కమిటీ సభ్యులకు సూచించాను' అని మీడియా ముందు మాట్లాడారు. అలీగఢ్‌తోపాటు హాథ్రస్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రతి మంగళవారం సత్సంగ్ పేరుతో బాబా ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతుంటారు. వేల సంఖ్యలో భక్తులు హాజరవుతుంటారు. కొన్నిసార్లు లక్షల్లో జనం వస్తుంటారు. జులై 2న హాథ్రస్‌లో నిర్వహించిన సత్సంగ్‌కు 80వేల మందికి ఏర్పాట్లు చేయగా.. రెండున్నర లక్షలమంది హాజరయ్యారు. 'సేవాదర్ ఆర్మీ'గా పిలిచే బృందం ఈ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇక ఆ రోజు ముఖ్యసేవాదర్‌గా ఉన్న దేవ్‌ప్రకాశ్ మధుకర్ శుక్రవారం రాత్రి దిల్లీలో పోలీసుల ముందు లొంగిపోయాడు. పోలీసులు నమోదుచేసిన ఎఫ్ఐఆర్‌లో అతడే ప్రధాన నిందితుడిగా ఉన్నాడు.

# ఫ్రెండ్లీగా పరిష్కరించుకుందాం..

మొదటిపేజీ తరువాయి..

ఖర్చుకు చెల్లింపులు. హైదరాబాద్‌లో ఉన్న మూడు భవనాలు ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించే అంశం. లేబర్ సెస్ పంపకాలు. ఉద్యోగుల విభజన అంశాలు చర్చకు వచ్చాయి. మంత్రుల, అధికారుల కమిటీ వీటిపై చర్చించనుంది. హైదరాబాద్‌లోని ప్రజాభవన్ వేదికగా తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం ప్రారంభమైంది. రేవంత్ ఎలా ఉన్నావంటూ చంద్రబాబు ఆప్యాయంగా పలకరించారు. కొద్దిసేపు ఇద్దరు నేతలు మాట్లాడుకున్న తర్వాత సమావేశం ప్రారంభమైంది. ప్రస్తుతం అధికారుల సమక్షంలో విభజన చట్టంలో అంశాలు, ఆస్తుల పంపకంపై చర్చించారు. ఇద్దరు సీఎంల భేటీలో దీర్ఘకాలంగా పరిష్కారం కానీ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ప్రజలు ఆశిస్తున్నారు. ఏపీ కొన్ని డిమాండ్లను తెలంగాణ ప్రభుత్వం ముందు పెట్టగా.. తెలంగాణ కొన్ని డిమాండ్లను ఏపీ ప్రభుత్వం ముందు పెడుతోంది. కొన్ని అంశాల్లో మాత్రం ఏకాభిప్రాయం వచ్చే అవకాశం కనిపించడం లేదు. ముఖ్యంగా విలీన గ్రామాల విషయంలో చర్చించినట్లు తెలుస్తోది. 2014లో టీడీపీ ప్రభుత్వం ఏర్పడటానికి ముందు భవిష్యత్తులో పోలవరం ప్రాజెక్టుకు ఎటువంటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు ఏడు మండలాలను ఏపీలో కలపాలని చంద్రబాబునాయుడు కోరగా.. కేందప్రభుత్వం సుముఖంగా స్పందించి.. ఏడు మండలాలను ఏపీలో విలీనం చేసింది. ఆ నిర్ణయాన్ని అప్పటి తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకించింది. ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం కూడా విలీన మండలాలను తెలంగాణలో కలపాలని కోరుతోంది. ఇది పక్కనపెడితే మిగిలిన అంశాల్లో ఎక్కువ అంశాలకు ఈ సమావేశంలో పరిష్కారం దొరికే అవకాశం ఉంది. ఈక్రమంలో ఆర్థికపరమైన అంశాలపై ఏవిధమైన చర్చ జరుగు తుందనేది ఆసక్తిగా మారింది.వీటితో పాలు ఏపీ, తెలంగాణ మధ్య వివాదం నెలకొన్న విద్యుత్ బకాయిల అంశంపై మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి చంద్రబాబు, రేవంత్ రెడ్డి చర్చించారు. పదేళ్లుగా పరిష్కారం కాని విభజన హామీలు, ఆస్తుల పంపకానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. ప్రజా భవన్‌లో సమవేశమైన తెలుగు రాష్ట్రాల సీఎంలు రెండు గంటలపాటు చర్చలు జరిపారు. మరోసారి భేటీ కావాలని ఇద్దరు నేతలు నిర్ణయించారు. ప్రధానంగా భద్రాచలం నుండి ఏపీలో కలిపిన ఏడు మండలాల్లోని 5 గ్రామాలను తమకు తిరిగి ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. ఈ విషయంలో చంద్రబాబు సానుకూలంగా స్పందించి నట్లు తెలుస్తోంది. భద్రాచలం పట్టణానికి అనుకుని ఉన్న ఎటపాక, కన్నాయిగూడెం, పిచ్చుకలపాడు, గుండాల, పురుషోత్తపట్నం పంచాయతీలను..తిరిగి తెలంగాణలో కలపాలన్న డిమాండ్ ఎప్పటి నుండో వినిపిస్తుంది. ఈ గ్రామాల విలీనంతో భద్రాచలం పట్టణ అభివృద్ధికి అవకాశం ఉంటుందని చెబుతోంది. అయితే ఓ రాష్ట్రంలోని గ్రామాలను వేరే రాష్ట్రంలో కలపాలంటే.. కేంద్ర అను మతి తప్పనిసరి. కేంద్ర హోంశాఖకు లేఖ రాయాలని సమావేశంలో నిర్ణయించారు. ప్రజాభవన్ భేటీలో విభజన సమస్యల పరిష్కారానికి రోడ్ మ్యాప్ ఖరారు చేశారు ఇరువురు ముఖ్యమంత్రులు. రాష్ట్ర ప్రయోజనాలపై రాజీపడకుండా ఉమ్మడి అజెండాపై కలిసిపని చేయాలని రెండు రాష్ట్రాలు మొదటి నుంచి భావిస్తున్నాయి. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, అభివృద్ధి ప్రాజెక్టుల కోసం ఉమ్మడిగా ప్రయత్నిం చాలని, ఎగువ రాష్ట్రాలతో నీటి వాటాలపై కలిసి పోరాడేలా ఉమ్మడి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని నిర్ణయించారు. ఉమ్మడి ఏపీ విభజన జరిగి పదేళ్లు పూర్తయినా కూడా.. అనేక కీలకాంశాలు ఇంకా పెండింగ్‌లో ఉండిపోయాయి. అధికారుల స్థాయిలో కొన్నిసార్లు చర్చలు జరిగినా చాలా విషయాలు ఇంకా కొలిక్కి రాలేదు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రుల భేటీ సందర్భంగా ఉమ్మడిగా తొమ్మిది ఎజెండా అంశాలను ఖరారు చేశారు. ఈ ఎజెండాలో రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టం షెడ్యూలు 9, 10లో పేర్కొన్న సంస్థల ఆస్తుల పంపకాలు, విభజన చట్టంలో చేర్చని సంస్థల ఆస్తుల పంపకాలు, ఏపీ నాన్షియల్ కార్పొరేషన్ అంశాలు, పెండింగ్ విద్యుత్తు బిల్లులు, విదేశీ రుణ సాయంతో నిర్మించిన ప్రాజెక్టుల ఆస్తులు-అప్పుల పంపకాలు, ఉమ్మడి సంస్థలకు చేసిన చెల్లింపులు, లేబర్ సెస్ పంపకాలు, ఉద్యోగుల విభజన అంశాలపై చర్చించారు.

# నియోజకవర్గానికో నాలెడ్జ్ సెంటర్

మొదటిపేజీ తరువాయి..

ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మిషన్ మిషన్ భగీరథ పథకం పనితీరుపై ఈ నెల 15 వరకు నివేదిక ఇవ్వాలని కోరారు. మిషన్ భగీరథ నీటిని వినియోగించుకునే అంశం గ్రామసభల్లో ఓ ఎజెం డాగా చేర్చాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. తెలంగాణ డ్రింకింగ్ వాటర్ సప్లై కార్పొరేషన్‌తో అన్ని ఆవాసాలను అనుసంధానం చేయాలని మంత్రి సీతక్క కీలక ఆదేశాలు జారీ చేశారు. మిగిలిపోయిన అన్ని ఆవాసాలకు రక్షిత మంచి నీరు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. అడవుల్లో నివసించే ప్రజలకు సైతం కుళాయి నీళ్లు అందించాలని ఆదేశించారు.అడవుల్లో విద్యుత్ లైన్లు వేసేందుకు కేంద్ర అటవీ శాఖ అనుమతులు ఇవ్వడం లేదని, అడవుల్లో ఉన్న ఆవాసాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసి బోర్ల ద్వారా తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని ఆదేశించారు. నీటి సోర్స్ పాయింట్లు దగ్గర్లో ఉండేలా చూసుకోవాలన్నారు. గ్రామపంచాయతీల్లో ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు శుభ్ర పరచాలని సూచించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న తాగునీటినీ వినియోగించే విధంగా ప్రజలకు నమ్మకం కలిగించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. కాగా.. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ బడ్జెట్ ప్రతిపాదనలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ ఆర్థిక సంవత్సరానికి అవసరమైన బడ్జెట్ ప్రతిపాదనలను ఆర్థిక శాఖకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు నివేదించారు.

ఈ ఆర్థిక సంవత్సరానికి 51 వేల కోట్ల బడ్జెట్‌ను పీఆర్ అండ్



ఆర్డీ ప్రతిపాదించింది. గత బడ్జెట్లో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.23 వేల కోట్లు కేటాయింపులు జరిగాయని తెలిపారు. చేయూత కింద పింఛన్ల మొత్తాన్ని పెంచాలని పీఆర్ అండ్ ఆర్డీ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. చేయూత పథకం కోసం 22 వేల కోట్లు అవసరం అవుతాయని అంచన వేశారు. ప్రస్తుతం ఆసరా పెన్షన్ల కోసం రూ. 12 వేల కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. గ్రామీణ రహదారుల బ్జడెట్‌ను రెట్టింపు చేయాలని ప్రతిపాదించారు. మహిళా స్వయం సంఘాల లోన్ బీమా, ప్రమాద బీమా కోసం అవసరమైన నిధులను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

# రసాభాసగా గ్రేటర్ కార్పోరేషన్ సమావేశం

మొదటిపేజీ తరువాయి..

డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ సభ్యుల తీరుపై మేయర్ విజయలక్ష్మి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిరాయింపులను ప్రోత్సహించిందే బీఆర్ఎస్ పార్టీ అని మేయర్ అన్నారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో సమావేశం నుంచి వెళ్లిపోయారు. మీటింగ్ 15 నిమిషాలు వాయిదా వేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు మేయర్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. వాయిదా అనంతరం సమావేశాలు తిరిగి ప్రారంభం కాగా.. నేతలు తమ పరిధిలోని సమస్యలను ఏకరవు పెట్టారు.

బల్దియా కౌన్సిల్ సమావేశానికి కాంగ్రెస్ ,బీఆర్ఎస్, ఎంఐఎం, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎక్స్ అఫీషియో సభ్యులు, బీజేపీ నేతలు హాజరయ్యారు. కాగా, మేయర్, డిప్యూటీ మేయర్లపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు బీఆర్ఎస్ నేతలు సిద్ధమయ్యారు. మేయర్ గద్వాల విజయలక్ష్మితో పాటు డిప్యూటీ మేయర్ శ్రీలత, మరికొంత మంది కార్పొరేటర్లు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడంతో వీరి రాజీనామాకు పట్టుబట్టాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ఈ క్రమంలో బీఆర్ఎస్‌కు చెందిన గ్రేటర్ ప్రజా ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరు కావాలని నిర్దేశిరచింది. పార్టీ మారిన మేయర్ రాజీనామా డిమాండ్, ఇతర సమస్యలపై బహిరంగంగా ప్రశ్నించేందుకు బీఆర్ఎస్ నేతలు సిద్ధమయ్యారు.150 మంది కార్పొరేటర్లలో

ఇద్దరు ఎంఐఎం కార్పొరేటర్లు ఎమ్మెల్యేలు. మరో ఇద్దరు ఎర్రగడ్డ, గుడిమల్కాపూర్ కార్పొరేటర్లు చనిపోయారు. ప్రస్తుతం 47 మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఉన్నారు. ఎంఐఎంకు 41 మంది, బీజేపీకి 39, కాంగ్రెస్‌కు 19 మంది సభ్యులున్నారు.

దాదాపు నాలుగున్నర నెలల తర్వాత జరుగుతున్న కౌన్సిల్ సమావేశంలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అన్ని పార్టీలకు సంబంధించి 23 ప్రశ్నలతో సుదీర్ఘంగా చర్చ సాగేలా సభ సిద్ధమైంది. ఈ క్రమంలో సమావేశం ప్రారంభం కాగానే.. బీఆర్ఎస్ కార్పొరేటర్ల నిరసనతో సభ రసాభాసగా మారింది. అనంతరం నగరంలో పారిశుద్ధ్యం సరిగ్గా లేదని.. మేయర్ సహా అధికారులు చోద్యం చూస్తున్నారని బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర నేతలు సైతం జీహెచ్ఎంసీ పరిధిలోని సమస్యలు ఏకరవు పెట్టారు. వానా కాలం సమీపించినా నాలాల్లో పూడిక తీత పనులు జరగట్లేదని ఆందోళనకు దిగారు. చెరువులు కబ్జాకు గురవుతున్నాయని.. ఖాళీ పైపులు, గుర్రపు డెక్కలతో కొందరు కార్పొరేటర్లు నిరసన తెలిపారు. ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేశారు.

# నేడు గోల్కొండ బోనాలు

మొదటిపేజీ తరువాయి..

చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. దశాబ్ది ఉత్సవాల వేళ బోనాలను పటిష్టంగా నిర్వహిస్తామని మంత్రి సురేఖ తెలిపారు. తమకు ఇప్పుడు కలిసి వచ్చిందని అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి అందరికీ ఆషాఢ మాస బోనాల ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రమంతా సమృద్ధిగా వర్షాలు పడి, మంచి పంటలు పండాలని ప్రజలంతా సంతోషాలతో ఉండలని అమ్మవారిని కోరుకుంటున్నామన్నారు. జూలై 7వ తేదీ నుండి గోల్కొండ బోనాలతో ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. తెలంగాణ ఆషాఢ మాస దశాబ్ది బోనాల ఉత్సవాలను ఘనంగా జరపడానికి ప్రభుత్వం తరుపున అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. అధికారులను, స్థానిక దేవాలయాల కమిటీలను సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలు విజయవంతం అయ్యేలా చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం ఎన్ని ఏర్పాట్లు చేసినా ఉత్సవాల విజయవంతానికి హైదరాబాద్ ప్రజల సహకారం కావాలని అన్నారు. ఏ విధమైన సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం తరుపున అధికారులను ఆదేశించామన్నారు. శాంతి భద్రతలను కాపాడుతూ ఉత్సవాలను విజయవంతం చేయడానికి

అందరూ భాగస్వామ్యం కావాలని చెప్పారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ.. సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి అదనపు నిధులు తీసుకొచ్చారన్నారు. నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ఇదిలావుంటే ఆషాడమాసంలో గ్రామదేవతలను పూజించే సంప్రదాయం విస్తృతంగా కనపిస్తుంది. ముఖ్యంగా గ్రామాల్లో ఈ సంప్రదాయాలు ఎక్కువగా కనిపిస్తాయి. బోనాల విషయానికొస్తే సికింద్రాబాద్, హైదరాబాద్ తో పాటూ తెలంగాణ వ్యాప్తంగా,రాయలసీమలో కొన్ని ప్రాంతాల్లో ఉండే హిందువులు జరుపుకుంటారు. భాగ్యనగరంలో బోనాలంటే ఆ కళే వేరు. దీన్నే ఆషాడం జాతర అనికూడా పిలుస్తారు. 1869లో జంట నగరాలలో ప్లేగువ్యాధి వ్యాపించిన పుడు అమ్మవారి ఆగ్రహానికి గురయ్యామని భావించిన ప్రజలంతా అమ్మను శాంతింపజేసేందుకు ఈ పండుగ చేయడం ప్రారంభించారు. ఈ ఉత్సవం ముందుగా గోల్కొండలో కొలువై ఉన్న మహంకాళీ ఆలయం నుంచి ప్రారంభమై సికింద్రాబాద్, పాతబస్తీ ఆలయాల్లో వరుసగా జరుగుతుంది. ఈఉత్సవాల వేడుకల్లో ప్రధానమైనవి 8 అంగాలు.. ఘటోత్సవం, బోనాలు సమర్పించడం మొదలు.. రంగం, నిమజ్జనం వరకు ఉంటాయి. ప్రత్యేకమైన ఘటం (కలశం)లో అమ్మవారిని ఆవాహనచేసి ఊరేగింపుగా తీసుకెళతారు. బోనాలు ప్రారంభమైన మొదటి రోజు( జులై 7నుంచి) నుంచి పద్నాలుగో రోజు వరకూ ప్రతి రోజూ రెండు పూటలా అమ్మవారు కలశం రూపంలో నగరాల్లో, ఊర్లలో తిరుగుతూ భక్తుల నుంచి పూజలందుకుంటుంది. ఘటం అంటే కళశం నగరవీధులగుండా ఊరేగింపుగా తీసుకెళతారు. ఈ ఘటంపై అమ్మవారి రూపాన్ని చిత్రీకరిస్తారు. ఆలయ పూజారి ఒళ్లంతా పసుపు పూసుకుని ఘటాన్ని ఊరేగిస్తారు.. బోనం అంటే భోజనం.. అనుక్షణం కాపాడే శక్తి స్వరూపిణికి కృతజ్ఞతా పూర్వకంగా సమర్పించే ఆహారం. ఎవరెవరు ఎలాంటి మొక్కులు తీర్చుకుంటామని మొక్కుకున్నారో అవన్నీ అమ్మకు చెల్లిస్తారు. ముఖ్యంగా చక్కెరపొంగలి, బెల్లపు పొంగలి, కట్టెపొంగలి, పసుపు అన్నం ఇలా వివిధ రకాల ఆహారాన్ని సమర్పిస్తారు. ఇల్లు వాకిలి శుభ్రంచేసి, తలకు స్నానం ఆచరించి, నూతన వస్త్రాలు ధరించి..నైవేద్యం తయారు చేస్తారు. పసుపు, కుంకుమ, వేపాకులతో అలంకరించిన పాత్రలో అన్నాన్ని ఉంచి దానిపై మూతపెట్టి దీపం వెలిగించి.. గుంపుగా వెళ్లి మొక్కులు చెల్లించుకుంటారు. సర్వ రోగనివారిణి అయిన వేపాకులను ఎన్నో ఔషధ గుణాలన్న పసుపునీటిలో ముంచి అమ్మవారికి సమర్పించే ఆచారాన్నే వేపాకు సమర్పించడం అంటారు. వానాకాలం మొదలైన సందర్భంగా వ్యాపించే క్రిమికీటకాలను తరిమికొట్టేందుకు క్రిమినాశినిగా వేపాకు ఉపయోగపడుతుంది... పైగా అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన వృక్షం కూడా ఇదే. బోనాలు జరుపుకునే రోజు భక్తులంతా..నియమ నిష్టలతో తయారు చేసిన నైవేద్యాలను తీసుకొచ్చి బండ్లలో పెట్టిన తర్వాత ఆ బండి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తుంది. దీనినే ఫలహారబండి ఉత్సవం అంటారు. పోతురాజు అంటే ఏడుగులు అమ్మవార్లకు సోదరుడు. బోనాలు పండుగలో పోతురాజులే ప్రత్యేక ఆకర్షణ. ప్రతి బస్తీనుంచి పోతురాజు అమ్మవారి ఆలయం వరకూ విన్యాసాలు చేసుకుంటూ వెళతారు. కాళ్ళకి గజ్జెలుకట్టి, ఒళ్ళంతా పసుపు పూసుకుని, పసుపు నీటిలో ముంచిన ఎర్రటి వస్త్రాన్ని ధరించి...కళ్లకు కాటుక, కుంకుమతో పెద్ద బొట్టు, నడుముకు వేపాకు చుట్టి..పసుపు రంగు కొరడా ఝుళిపించి నాట్యం చేస్తూ ఫలహారం బండి ముందు నడుస్తాడు.

రంగం: బోనాలలో చివరి రోజు జరిగే ముఖ్యమైన ఘట్టం రంగం. అమ్మవారి సన్నిధికి ఎదురుగా ముఖమంటపంలో ఉన్న మాతంగేశ్వరి ఆలయంలో అమ్మవారికి ఎదురుగా ఓ స్త్రీ మట్టి కుండ మీద నిలబడి భవిష్యవాణి చెబుతుంది. దేశ రాజకీయం, వ్యవసాయం, వ్యాధులు, ప్రకృతి వైపరీత్యాల గురించి అమ్మవారు భవిష్యవాణి చెబుతుంది. రంగం ముగిసిన మర్నాడు పోతురాజులు అమ్మవారి సన్నిధిలో భక్తితో తాండవం చేస్తారు. ఆ సందర్భంలో సొరకాయ, ఎర్ర గుమ్మడికాయ వంటి కూరగాయల్ని పగుల గొట్టి అమ్మవారికి బలి ఇస్తారు. అప్పట్లో జంతువులను బలిచ్చేవారు. బలిచ్చే కార్యక్రమం అయిపోయిన తర్వాత అమ్మవారి చిత్రపటాన్ని అలంకరించి కలశాలతో పాటూ ఏనుగుపై ఎక్కించి మంగళ వాయిద్యాల మధ్య ఊరేగించి నిమజ్జనం చేస్తారు.

# ప్రభుత్వ సలహాదారుగా కెకె

మొదటిపేజీ తరువాయి..

రాజీనామా చేశారు. తాను బీఆర్ఎస్ పార్టీ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యానని... ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో నైతిక విలువలకు కట్టుబడి రాజీనామా చేశాను అని తెలిపారు. 2026 ఏప్రిల్ 9 వరకు రాజ్యసభ ఎంపీగా కేకే పదవీకాలం ఉంది. బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్‌గా పని చేసిన కేకే..జూలై 3న కాంగ్రెస్‌లో చేరారు. గతంలో కాంగ్రెస్‌లోనే సుదీర్ఘకాలం ఉన్న ఆయన.. పీసీసీ చీఫ్‌గా పని చేశారు. తిరిగి కాంగ్రెస్‌లో చేరడంతో సిఎం ఆయనకు సలహాదారు పదవిని కట్టబెట్టారు.

# సికింద్రాబాద్-గోవా మధ్యనేరుగా బైవీక్లీ

మొదటిపేజీ తరువాయి..

మధ్య వారానికి 4 రోజులు ప్రయాణం సాగించే రైలుకు గోవాకు వెళ్ళే 4 కోచ్‌లను కలిపేవారు. ఈ 4 కోచ్ లను తిరిగి గుంతకల్ వద్ద షాలిమార్ - గోవా మధ్యన తిరిగే రైలుకు కలిపి ప్రయాణం సాగించేవారు. ఇప్పుడు సికింద్రాబాద్-వాస్కోడగామా (గోవా) మధ్య బైవీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభిస్తున్నట్లు రైల్వేశాఖ ప్రకటించడంతో ప్రధాని మోదీ, రైల్వే శాఖమంత్రి అశ్వినీవైష్ణవ్‌లకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్ చుట్టపక్కల ప్రాంతాల నుంచి గోవా వెళ్లే పర్యటకుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో నూతన సర్వీసు అందుబాటులోకి రావడం పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సికింద్రాబాద్-గోవా బై-వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు సికింద్రాబాద్, కాచిగూడ, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, గద్వాల్, కర్నూల్ సిటీ, డోన్, గుంతకల్, బళ్లారి, హోస్పేట, కొప్పల్, గడగ్, హుబ్బళ్లి, ధార్వాడ్, లోండా, క్యాసిల్ రాక్, కులెం, సాన్వోర్‌డెమ్, మడగావ్ జంక్షన్లలో ఆగుతూ.. వాస్కోడగామా చేరుకుంటుందని రైల్వేశాఖ వెల్లడించింది.

# నీట్ యూజి కౌన్సిలింగ్ వాయిదా

మొదటిపేజీ తరువాయి..

ఎన్‌టీఏ వెల్లడించింది. కొత్త తేదీలను కేంద్ర విద్యాశాఖ త్వరలోనే ప్రకటిస్తుందని తెలిపింది. కాగా.. నీట్ కౌన్సెలింగ్‌ను వాయిదా వేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించినప్పటికీ ఎన్‌టీఏ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఈ ఏడాది మే 5వ తేదీన దేశవ్యాప్తంగా నీట్ యూజీ 2024 పరీక్ష నిర్వహించారు. అయితే పరీక్ష పేపర్ లీక్ అవడంతో పాటు పరీక్ష నిర్వహణలో అవకతవకలు చోటుచేసుకున్నట్లు వార్తలు రావడంతో దేశవ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. ఫలితాల్లో ఏకంగా 67 మందికి జాతీయస్థాయిలో మొదటి ర్యాంకు రావడంపైనా పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. నీట్ అభ్యర్థుల్లో 1563 మందికి గ్రేస్ మార్కులు కలపడం, ఓఎంఆర్ షీట్లు అందకపోవడం, న్యాయస్థానం పర్యవేక్షణలో దర్యాప్తు సహా నీట్‌ను రద్దు చేయాలన్న డిమాండ్లతో సుప్రీం కోర్టులో దాదాపు 26 పిటిషన్లు దాఖలయ్యాయి. నీట్-యూజీ పరీక్షను రద్దు చేయడం హేతుబద్ధం కాదు. దీనిపై గతంలో విచారణ జరిపిన న్యాయస్థానం.. కౌన్సెలింగ్ వాయిదా వేయాలన్న పిటిషనర్ల అభ్యర్థులను తోసిపుచ్చింది. మరోవైపు, సుప్రీం ఆదేశాల మేరకు ఇటీవల గ్రేస్ మార్కులు కలిపిన విద్యార్థులకు మళ్లీ పరీక్ష నిర్వహించి సవరించిన నీట్ ర్యాంకుల జాబితాను ఎన్‌టీఏ విడుదల చేసింది. ఈ క్రమంలోనే అక్రమాల ఆరోపణలపై కేంద్రం, ఎన్‌టీఏ శుక్రవారం సర్వోన్నత న్యాయస్థానానికి అఫిడవిట్లు సమర్పించాయి. నీట్-యూజీ పరీక్షను రద్దు చేయడం వల్ల నిజాయతీ కలిగిన లక్షల మంది అభ్యర్థులు నష్టపోతారని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు రుజువులు లేనప్పుడు ఆ చర్య చేపట్టడం హేతుబద్ధం కాదని స్పష్టం చేసింది. ఈ పిటిషన్లపై జులై 8న తదుపరి విచారణ జరగనుంది. ఈ పరిణామాల వేళ కౌన్సెలింగ్‌ను వాయిదా వేయడం గమనార్హం.

## 22 నుంచి పార్లమెంట్

# బడ్జెట్ సమావేశాలు

మొదటిపేజీ తరువాయి..


కూటమి కొలువుదీరిన వేళ..ఇటీవలే పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. ఈ క్రమంలో కొత్త ప్రభుత్వం జులై 23న బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగానూ ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మరోమారు బడ్జెట్‌ను సమర్పించనున్నారు. ఈ విషయాన్ని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఈ నేపథ్యంలో జులై 22 నుంచి ఆగస్టు 12 వరకు బడ్జెట్ సమావేశాలు జరుగుతాయని తెలిపారు. ఎన్నికల సంవత్సరం కావడంతో ఈ ఏడాది ఫిబ్రవరి 1న నిర్మలమ్మ ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఇప్పుడు కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో పూర్తి స్థాయి బడ్జెట్‌ను తీసుకొస్తున్నారు. మోదీ 3.0లో ప్రవేశపెట్టనున్న తొలి బడ్జెట్ ఇదే. దీంతో వరసగా ఏడుసార్లు బడ్జెట్ సమర్పించిన ఘనతను నిర్మలా సీతారామన్ అందుకోనున్నారు. ఇప్పటి వరకు మొరార్జీ దేశాయ్ వరసగా ఆరుసార్లు బడ్జెట్ సమర్పించారు. 2019లో రెండోసారి మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీతారామన్‌కు ఆర్థిక శాఖ బాధ్యతలు అప్పగించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ తర్వాత బడ్జెట్ ప్రవేశపెట్టిన రెండో మహిళగా గుర్తింపు పొందారు. ఎప్పటిలా సూట్‌కేసులో కాకుండా రాజముద్ర ఉన్న ఎరుపు రంగు వస్త్రంలో బడ్జెట్ ప్రతులను తీసుకొచ్చే కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు.

పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు బడ్జెట్ సమర్పణ తేదీలను కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు శనివారంనాడు ప్రకటించారు. జూలై 22వ తేదీన బడ్జెట్ సమావేశాలు ప్రారంభమై ఆగస్టు 12వ తేదీతో ముగుస్తాయని,బడ్జెట్ సమావేశాల రెండో రోజైన జూలై 23న కేంద్రబడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెడతారని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మంత్రి తెలిపారు. భారత ప్రభుత్వం సిఫారసుల మేరకు పార్లమెంటుబడ్జెట్ సమావేశాలు జరిపేందుకు రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. 2024-25 కేంద్ర బడ్జెట్‌ను జూలై 23వతేదీన లోక్‌సకు సమర్పిస్తాం' అని రిజిజు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెడుతున్న తొలి బడ్జెట్ ఇదే కావడం విశేషం. ఈసారి బడ్జెట్‌లో పలు చారిత్రక నిర్ణయాలు తీసుకోనున్నారనే అంచనాలు కూడా బలంగానే ఉన్న నేపథ్యంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టే బడ్జెట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# భద్రాద్రి అభివృద్ధిపై పడని అడుగులు

## మాస్టర్‌ప్లాన్ వెనక్కిపోయినట్లేనా? - పట్టింపు లేని నేతలు

**భద్రాద్రికొత్తగూడెం,జూలై6(నమస్తే ఉదయం):** యాదాద్రి తరహాలోనే భద్రాద్రిని కూడా అద్భుత పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దే సంకల్పానికి ముహూర్తం కుదరడం లేదు. మరోవైపు పోలవరంతో భద్రాద్రికి ముప్పు అన్న ఆందోళన వస్తోంది. ఈ రెడు విషయాలపై ఎలాంటి స్పందనా కానరావడం లేదు. మరోవైపు భద్రాద్రి రక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. భద్రాచలం ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్‌ప్లాన్ రూపకల్పన పై గతంలో భద్రాచలానికి వచ్చి అధికారులు,నాటి మంత్రి తుమ్మల తదితరులతో చర్చించి, పలుసూచనలు చేశారు. ఆలయ అధికారులు, దేవస్థానం పండితులు, స్తపతులతో కలిసి భద్రాద్రి అభివృద్ధి మాస్టర్ ప్లాన్ గురించి చర్చించారు. కానీ అవన్నీ పక్కకుపోయాయి. తుమ్మల రాజకీయంగా ఇప్పుడు మళ్లీ బలంగా ఉన్నందున ఆయన దీనిని ముందుకు తీసుకుని వెళ్లాలని అన్నారు. గతంలో ప్రకటించిన వంద కోట్ల అభివృద్ధి నిధులతో చేపట్టబోయే పనుల కోసం ప్రస్తుతం మాస్టర్‌ప్లాన్ రూపొందించాలని స్థానికులు కోరుతున్నారు. యాదాద్రి లాగా భద్రాద్రిని పునర్నించాలని కోరుతున్నారు. భద్రాద్రి ఆలయాన్ని జాతీయస్థాయిలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దాలన్నదే తెలంగాణ ప్రభుత్వ సంకల్పంగా ఉందని నాటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఇప్పుడు ఆయన కూడా మంత్రిగా ఉన్నందున చొరవ తీసుకోవాలని అన్నారు. ఏళ్లు దాటినా కార్యాచరణ గడపదాటలేదు. ఇక్కడ ఏటా శ్రీరామ నవమి, సీతారామ చంద్రస్వామి కల్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. అయినా ఆలయ అభివృద్ధి ప్రణాళిక మాత్రం ముందుకు సాగడం లేదు. ఆలయ అభివృద్ధిని చేపట్టి భద్రాద్రిని పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దాలని స్థానికులుకోరుతున్నారు.


బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, జగ్జీవన్ రామ్‌కు పుష్పాంజలి ఘటిస్తున్న కార్పోరేటర్ సంగీత, బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రతినిధులతో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

# అట్టడుగు వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్ రామ్ చేసిన కృషి ఎనలేనిది: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి చేయాలి : రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్**

**బాబు జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తి దాయకం..**

**రాజేంద్రనగర్,జులై 06(నమస్తే ఉదయం):** బాబు జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తి దాయకం, దళిత సమాజాభివృద్ధి కోసం వారు చేసిన సేవలు గొప్పవని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతూనే సామాజిక సమానత్వం,అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం అలుపెరుగని పోరాటం చేశారని,వివక్షను,అణచివేతను జయించిన యోధుడు అని కొనియాడారు.శనివారం జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఉత్సవాల సమితి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ అరంఘర్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ... సమాజం బాబు జగ్జీవన్‌రామ్‌ను ఇప్పటికీ గుర్తు పెట్టుకుందంటే ఆయన సేవలే కారణమని అన్నారు.బడుగు, బలహీన వర్గాల ప్రజల్లో వెలుగులు నింపడానికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు.పరిపాలనా దక్షత, ప్రజల పట్ల ఎనలేని ప్రేమ,నిస్వార్థ సేవలతో తిరుగులేని నాయకుడిగా గుర్తింపు పొందారని,ఉప ప్రధానిగా విశేష సేవలు అందించారని తెలిపారు. స్వాతంత్రోద్యమం,సామాజిక సంస్కరణోద్యమాలు కన్న ముద్దు బిడ్డ డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ అని కీర్తించారు. సామాజిక సంస్కరణోద్యమాల్లో జగ్జీవన్‌రామ్ విశిష్టమైన స్థానాన్ని పదిల పరుచుకున్నారన్నారు.నివాళులర్పించిన వారిలో దళిత సంఘం అధ్యక్షుడు పచ్చ నర్సింగ్ రావు,

ప్రధాన కార్యదర్శి ఎడ్లకాడి సూర్యం, కోశాధికారి రగడంపల్లి శ్రావణ్, వ్యవస్థాపక అధ్యక్షుడు పోయిల జీవన్ దాస్, వనం నర్సింహ మాదిగ, మాజీ అధ్యక్షులు గోల్కొండ రాజ్ కుమార్,మంత్రి చంద్రశేఖర్,పంబాల రాజు,పలుగుచేరువు మహేష్,ఇతర దళితనాయకులు పోయిల మోహన్ రావు, జాన్ పాల్, నందిగామ నర్సింహ, రాంబాబు, సికందర్, మాధవులు, పి.మహేందర్, రమేష్, ఎ.బాబురావు, జంగయ్య, సంజీవ, గౌతమ్, సుమన్, ఎడ్లకాడి చంద్రశేఖర్,ఎ.శేకర్ తదితరులు నివాళులర్పించారు.




శ్యామ్ ముఖర్జీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న బిజెపి రాష్ట్ర నాయకులు బొక్క బాల్ రెడ్డి, మొక్క నాటుతున్న బొక్క బాల్, బిజెపి నాయకులు

# శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆశయాల స్ఫూర్తితో ముందుకు సాగాలి

**- బిజెపి రాష్ట్ర నాయకులు బొక్క బాల్**

**శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి..**

**రాజేంద్రనగర్,జూలై 06(నమస్తే ఉదయం):** అఖండ భారత్ ఐక్యంగా ఉండాలని శ్యామ్ ప్రసాద్‌ముఖర్జీ ఆకాంక్షించి ఆదిశగా పాటుపడ్డారని బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు బొక్క బాల్ రెడ్డి అన్నారు. శనివారం రాజేంద్ర నగర్ సర్కిల్ ఉప్పరపల్లి బీజేపీ కార్యాలయంలో జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా బొక్క బాల్ రెడ్డి మాట్లాడుతూ..ఒకే ప్రధాని,ఒకే జెండా,ఒకే చట్టం అనే నినాదంతో జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యాం ప్రసాద్ దేశం కోసం ప్రాణాలర్పించారని గుర్తు చేశారు.దేశం కోసం శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగం మరువలేనిదని తెలిపారు. దేశంలో కాశ్మీర్ కూడా అంతర్భాగమేనంటు పోరాటం చేస్తూ ఆత్మబలిదానం చేశారని కొనియాడారు.

సమైఖ్య భారత వని కోసం గాను ప్రాణాలర్పించిన త్యాగధనుడు డా.శ్యాం ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు.పార్టీ శ్రేణులందరూ డా.శ్యాం ప్రసాద్‌ముఖర్జీ ఆశయ సాధన కోసం అంకితభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.2047 నాటికి స్వాతంత్రం వచ్చి వంద సంవత్సరాలు పూర్తయిన అమృత కాలం వరకు మోడీ వికసిత్ భారత్ లక్ష్యంగా పాలన కొనసాగిస్తున్నారని తెలిపారు.

అఖండ భారతం,దేశ ఐక్యత కోసం మనమంతా పాటు పడుదామని తెలిపారు.దేశంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి వచ్చిందంటే దానికి కారణం జన సంఘ్ పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ వల్లనే అని అన్నారు.ఈ సందర్భంగా బొక్క బాల్ రెడ్డి మొక్కలు నాటారు.

ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు విఠల్,మోహన్ రెడ్డి,గోనే శ్రీకాంత్ రెడ్డి,మహేందర్ రెడ్డి,కరుణాకర్,రాజ్ పాల్,వంశీ,పవన్ తదితరులు పాల్గొన్నారు.



భారత మాజీ ఉప ప్రధాని స్వర్గీయ జగ్జీవన్ రామ్‌కు నివాళులర్పిస్తున్న రాజేంద్రనగర్ కాంటెస్ట్ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్ రెడ్డి

## గొప్ప సంఘ సంస్కర్త బాబు జగ్జీవన్ రామ్..

**కుల రహిత సమాజం కోసం కృషి చేసిన మహనీయుడు..**

**ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్ జయంతి..**

**రాజేంద్రనగర్ కంటెస్టెంట్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి**

**రాజేంద్రనగర్,జులై 06(నమస్తే ఉదయం):** అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని రాజేంద్ర నగర్ బిజెపి కాంటెస్టెడ్ ఎమ్మెల్యే,మైలార్ దేవులపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కారించుకొని బీజేపీ దళిత మోర్చా ఆధ్వర్యంలో బుద్వేల్ చౌరస్తాలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో తోకల శ్రీనివాస్ రెడ్డి హాజరై బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...భారతీయ సమాజానికి బాబూ జగ్జీవన్ రామ్ చేసిన సేవలు అపారమైనవని ఆయన కొనియాడారు.సమాజ అభివృద్ధికి అవిశ్రాంతంగా చేసిన కృషిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలని అన్నారు.

జాతీయోద్యమంలో పాల్గొన్న జగ్జీవన్‌రామ్ అకుంఠిత దీక్షతో అత్యున్నత స్థానానికి ఎదిగారని,ఆయన దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు.కుల రహిత సమాజం కోసం కృషిచేసిన మహనీయుడని అన్నారు. అన్ని వర్గాల సమానత్వాన్ని చాటి చెప్పిన జగ్జీవన్ రామ్‌ను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు భారతప్రభుత్వం కేబినేట్‌లోసుదీర్ఘకాలంగా మంత్రిగా, ఉప ప్రధానిగా సేవలు అందించారన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేస్తూనే సామాజిక సమానత్వం కోసం కృషి చేసిన మహనీయులు బాబు జగ్జీవన్ రామ్ అని చెప్పారు.దళితుల హక్కుల అమల్లో కీలక పాత్ర పోషించడంతో పాటు వారు విద్యావంతులుగా, ఆత్మాభిమానం కలిగిన వారిగా ఉండాలని జీవితాంతం పరితపించారన్నారు.బాబు జగ్జీవన్ రామ్ నిర్వహించిన ప్రతి పదవితో వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన మార్గదర్శి అని తోకల శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.జగ్జీవన్‌రామ్ అణగారినవర్గాల హకుల కోసం అవిశ్రాంత పోరాటం చేసిన రాజకీయ–సామాజిక యోధుడని కొనియాడారు.దేశంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిత్యం పాటు పడ్డారని, నేటి యువత ఆయన స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు.నివాళులర్పించిన వారిలో

సీనియర్ బీజేపీ నాయకులు,రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, జిల్లా ఎస్సి మోర్చా ప్రధాన కార్యదర్శి కోరని క్రాంతి,డివిజన్ ఎస్సి మోర్చా ప్రధాన కార్యదర్శి ఇ.వేణుగోపాల్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోరిని బాల్ రాజ్, కాంగ్రెస్ నాయకులు కోరని శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



## గ్రామీణులకు చేరువకానున్న మీ సేవ కేంద్రాలు

**- జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు**

**జిల్లాకు 20 మీసేవ కేంద్రాలు మంజూరు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై6(నమస్తే ఉదయం):** జిల్లాలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో మీ–సేవ కేంద్రాలను పూర్తిస్థాయిలో ఏర్పాటుకు తనికీ చేయాలని అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు ఎ.పి.డి.లకు ఆదేశించారు.

శనివారం గ్రామీణ పేదరిక నిర్మూలనకు సంఘం (సెర్ప్) సీఈవో దివ్య హైదరాబాద్ నుంచి డి.ఆర్.డి.ఓ ల తో మీసేవ కేంద్రాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలను వ్యాపార రంగాల్లో ప్రోత్సహించేందుకు గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇందిర మహిళాశక్తి శ్రీ పథకం ద్వారా మీసేవ కేంద్రాలు మంజూరుకు నిర్ణయించింది. ఇందులో భాగంగా జిల్లాకు 20 కేంద్రాలు మంజూరయ్యాయి. విద్య అర్హత బట్టి పరీక్షలు నిర్వహించి ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లడుతూ గ్రామాలలో గవర్నమెంట్ లొకేషన్‌లో మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేయడంలో సరైన సౌకర్యాలు ఉన్నాయో లేదా సర్వే చేసి రిపోర్టు ఇవ్వవలసిందిగా ఏ.పి.డి.లకు ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఈడియం శివ, తదితరులు పాల్గొన్నారు.




## ఉన్నత విద్యలో విద్యార్థులకు న్యాక్ ఎంతో అవసరం

**జేబీఆర్ ఆర్కిటెక్చర్ ప్రొఫెసర్ గాయత్రి జోగినేపల్లి**

**మొయినాబాద్ జులై 06(నమస్తే ఉదయం):** ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు న్యాక్ ఎంతో ఉపయోగపడుతుందని , న్యాక్ తోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జేబీఆర్ ఆర్కిటెక్చర్ ప్రొఫెసర్ గాయత్రి జోగినేపల్లి అన్నారు శనివారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అండపూర్ చౌరస్తాలో గల జేబీఆర్ ఆర్కిటెక్చర్ కళాశాలలో న్యాక్ అభినందన సభను నిర్వహించారు ఈ సందర్భంగా ప్రొఫెసర్ గాయత్రి మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, ఉమ్మడి రాష్ట్రాలలో జేబీఆర్ ఆర్కిటెక్చర్ కళాశాలకు ఏ గ్రేట్ రావడం చాలా సంతోషంగా ఉందని వారు తెలిపారు ఈ ఉమ్మడి రాష్ట్రాలలో 471 ఆర్కిటెక్చర్ కళాశాలలో ఉన్నప్పటికీ 33 కళాశాలలకే న్నాక్ లభించిందని సూచించారు ఇందులో ఏ గ్రేడ్ జేబీఆర్ ఆర్కిటెక్చర్ కళాశాలకే రావడం ఎంతో సంతోషంగా ఉందని గర్వకారంగా ఉందని అన్నారు ఈ న్యాక్ తో విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని అందులో భాగంగా రీసెర్చ్ అకాడమిక్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్లేస్మెంట్స్ మెరుగైనర్ లభిస్తాయని సూచించారు ఈ కార్యక్రమంలో కళాశాల చైర్పర్సన్ వంశీధర్ ప్రిన్సిపల్ జెబిఆర్ఈసి డాక్టర్ వెంకట రమణారెడ్డి , జేబీఆర్ ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ శర్మ,డాక్టర్ వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సునీల్ కుమార్ హెచ్ ఓ డి ప్రొఫెసర్ స్రవంతి న్యాక్ కోఆర్డినేటర్ అసోసియేట్ మౌనిక యాదవ్ , ఐక్యూ సి హెడ్ ప్రొఫెసర్ వరియా ఇతర కళాశాలల ప్రిన్సిపాల్ లు శ్రీనివాసరావు సుమజ్ఞ పట్నాయక్ , డాక్టర్ జె వి సి శర్మ, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు డీఏ, పీఆర్‌సీ ఇవ్వాలి




ఎం ఎ నయీమ్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

**రాజేంద్రనగర్, జూలై6(నమస్తే ఉదయం):** రాజేంద్ర నగర్‌లో శనివారం ఉద్యోగ సంఘాల నాయకులు సమావేశమై ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన రాజేంద్రనగర్ తాలూకా ఉద్యోగ సంఘాల ఛైర్మన్ ఎం ఎ నయీమ్‌ను సన్మానించారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఏఆర్ఐలోని రాజేంద్రనగర్ యూనియన్ ఆఫీసులో ఉద్యోగుల సమావేశం జరిగింది. ఉద్యోగులకు రావాల్సిన డీఏ, పీఆర్‌సీ గురించి చర్చిం చారు.ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని నిర్ణయించారు. ఉద్యోగులకు రాయితీలు రావటానికి కేంద్ర సంఘ ముతో మాట్లాడి కార్యక్రమాలు చేపడుతామన్నారు.

సమావేశంలో 50 మంది ఉద్యోగులు హాజరు అయ్యారు. త్వరలోనే రాజేంద్రనగర్ తాలూకా ఉద్యోగ సంఘాల ఛైర్మన్‌ను నియమించుకోవడం జరుగుతుందని తెలిపారు.



శ్యాముఖర్జీ చిత్రపటానికి పుష్పాంజలు ఘటిస్తున్న బిజెపి నాయకులు

## ఆర్టికల్ 370 రద్దుకు పోరాడిన యోధుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ..

**జనసంఘ్ వ్యవస్థాపకుడు ముఖర్జీకి నేతల నివాళి..**


**రాజేంద్రనగర్ సీనియర్ బిజెపి నాయకులు రావుల భాస్కర్**

**రాజేంద్రనగర్,జులై 06(నమస్తే ఉదయం):** జమ్మూ కశ్మీర్ స్వయం ప్రతిపత్తి రద్దు(ఆర్టికల్-370) కోసం అవిశ్రాంతంగా పోరాడిన ఘనత జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీకే దక్కుతుందని రాజేంద్రనగర్ సీనియర్ బిజెపి నాయకులు రావుల భాస్కర్ అన్నారు. డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి పురస్కరించుకొని శనివారం మైలార్ దేవులపల్లి డివిజన్ దళిత మోర్చ అధ్యక్షుడు కొవ్వకుల బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకలకు రావుల భాస్కర్ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దేశ సమగ్రత కోసం ప్రాణాలు త్యాగం చేసిన మహానీయుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ అని తెలిపారు.కాశ్మీర్ సమస్యలు కోసం నిరంతరం పోరాడిన వ్యక్తి జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అన్నారు. నేడు భారతదేశంలో కాశ్మీర్ అంతర్భాగంగా ఉందంటే ముఖర్జీ బలిదానమే ప్రధాన కారణమన్నారు.దేశవ్యాప్తంగా అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించి తన ప్రాణాలు అర్పించిన గొప్ప జాతీయవాది ముఖర్జీ అని కొనియాడారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ జనసంఘ్‌ను స్థాపించి మార్గదర్శకులయ్యారని కొనియాడారు.నేటి తరం అటువంటి నాయకులను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నవారు మురళీధర్ రెడ్డి,సంతు గౌడ్,నెల్లుట్ల జగన్,నరసింహా రాజు, ఎన్ను శ్రీనివాస్ రెడ్డి,మన్మోహన్ రెడ్డి,రఘు,పొట్టగల రాజు,ఎన్నూ శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టీపీసీసీ రాష్ట్ర లీగల్ సెల్ వైస్ చైర్మన్ దేశాల భూపాల్‌ను సన్మానించిన న్యాయవాదులు

**న్యాయవాది దేశాల భూపాల్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు**

**రాజేంద్రనగర్, జూలై6(నమస్తే ఉదయం):** సీనియర్ న్యాయవాది, రాజేంద్రనగర్ ఇంద్రారెడ్డి నగర్ వాస్తవ్యులు దేశాల భూపాల్ టీ పీసీసీ రాష్ట్ర లీగల్ సెల్ వైస్ చైర్మన్ గా నియమితులైనారు. ఈ సందర్భంగా, పలువురు సీనియర్ న్యాయవాదులు దేశాల భూపాల్ కు అభినందనలు తెలిపారు. శంషాబాద్ లోని ఓ వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, టీ పీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్, రంగారెడ్డి జిల్లా లీగల్ సెల్ చైర్మన్ వెదిరే వేణుగోపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదిగా పార్టీకి ఎనలేని సేవలకు గుర్తింపుగా వైస్ చైర్మన్ పదవి వరించిందన్నారు. అనంతరం దేశాల భూపాల్ మాట్లాడుతూ, నాపై నమ్మకంతో పార్టీ అప్పగించిన ఈ పదవి నా బాధ్యతను మరింత పెంచిందన్నారు. సామాన్యులకు న్యాయసేవలను మరింత విస్తృతం చేస్తామని చెప్పారు. ఈ



కార్యక్రమంలో టీ పీసీసీ లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు ఉదయ్ కాంత్, కన్వీనర్ గణేష్, సుమారు 200మంది న్యాయవాదులు పాల్గొన్నారు.



## వ్యవసాయ కళాశాల రాజేంద్రనగర్‌లో “ఏక్ పేడ్ మాకె నామ్ కార్యక్రమం”


**రాజేంద్రనగర్,జూలై 06(నమస్తే ఉదయం):** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల,జాతీయ సేవా పథకం విభాగం ఆధ్వర్యంలో “ఏక్ పేడ్ మాకె నామ్” కార్యక్రమంలో భాగంగా విశ్వవిద్యాలయం హెల్త్ సెంటర్ ఆవరణలో శనివారం వివిధ రకాల మొక్కలు నాటారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ జెల్లా సత్యనారాయణ హాజరై మొక్కలను నాటి పర్యావరణంలో మొక్కల ప్రాముఖ్యతను తెలియజేశారు.మొక్కలను నాటడం కాదు వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఎన్ఎస్ఎస్ వాలంటీర్లపై ఉందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సి. నరేంద్రరెడ్డి,డాక్టర్ ఎం.మాధవి, సీనియర్ ప్రొఫెసర్ యూనివర్సిటీ హెడ్, హెల్త్ సెంటర్ ఇన్చార్జ్ డాక్టర్ సి.పద్మవేణి, బోధన, బోధనేతర సిబ్బంది, హెల్త్ సెంటర్ సిబ్బంది, ఎన్ఎస్ఎస్అధికారులు,వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సులో పురుడు పోసిన మహిళకు సన్మానం

**పుట్టిన బిడ్డకు జీవితకాలం ఉచిత బస్ పాస్**

**హైదరాబాద్,జూలై6(నమస్తే ఉదయం):** ఆర్టీసీ బస్సులో గర్భిణికి పురుడుపోసి మానవత్వం చాటుకున్న సంస్థ సిబ్బందిని టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం అభినందించింది. హైదరాబాద్ బస్ భవన్‌లో శనివారం ఉన్నతాధికారులతో కలిసి సంస్థ ఎండీ వీసీ సజ్జనర్ వారిని ఘనంగా సన్మానించారు. బస్సులో జన్మించిన చిన్నారికి తమ బస్సుల్లో జీవిత కాలం ఉచితంగా ప్రయాణించేలా బస్ పాస్‌ను అందిస్తున్నట్లు ప్రకటించారు. ఆర్టీసీ బస్సులు, బస్ స్టేషన్‌లలో పుట్టిన పిల్లలకు జీవిత కాలపు ఉచిత బస్ పాస్‌ను ఇవ్వాలని గతంలో యాజమాన్యం తీసుకున్న నిర్ణయం మేరకు.. ఈ ఆడబిడ్డకు బర్త్ డే గిఫ్ట్‌గా లైఫ్ టైం ఫ్రీ బస్ పాస్‌ను మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్‌లోని ముషీరాబాద్ డిపోకు చెందిన 1 జెడ్ రూట్ బస్సులో శుక్రవారం ఉదయం శ్వేతా రత్నం అనే గర్భిణీ ఆరాంఘర్‌లో ఎక్కారు. బహదూర్‌పూర వద్దకు రాగానే ఆమెకు పురిటి నొప్పులు తీవ్రమయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన కండక్టర్ ఆర్.సరోజ అప్రమత్తమై మహిళా ప్రయాణికుల సాయంతో సాధారణ ప్రసవం చేశారు. ఆమె పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చారు. డెలివరీ అనంతరం అనంతరం మెరుగైన వైద్యం కోసం బస్సులోనే సమీపంలోని గవర్నమెంట్ మెటర్నటీ ఆస్పత్రికి తరలించారు. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. సమయస్ఫూర్తితో స్పందించి.. సకాలంలో కాన్పు చేసిన కండక్టర్ సరోజ సేవలను ఈ సందర్భంగా టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ ప్రశంసించారు. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా తల్లీబిడ్డను బస్సులోనే మెటర్నటీ ఆస్పత్రికి తీసుకెళ్లిన డ్రైవర్‌ను కూడా అభినందించారు. కండక్టర్ చాకచక్యంగా వ్యవహరించడం తోనే తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారని



అన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో సంస్థ సీవోవో డాక్టర్ రవిందర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వ రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, కృష్ణకాంత్, హైదరాబాద్ ఆర్ఎం వరప్రసాద్, ముషీరాబాద్ డీఎం కిషన్, తదితరులు పాల్గొన్నారు.

### వయోజనులందరికీ అక్షరాస్యతపై

## అవగాహన కల్పించాలి

**- అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై6(నమస్తే ఉదయం):** జిల్లాలో ఉన్న వయోజనులందరికీ న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమంలో భాగంగా అక్షరాస్యతపై అవగాహన కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు అధికారులకు ఆదేశించారు.

శనివారం ఐ డి ఓ సి కాన్ఫరెన్సు హాలు నందు సంబంధిత శాఖల జిల్లా అధికారులతో న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమంపై



అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇట్టి కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో అమలు చేసేందుకు నిర్దిష్టమైన కార్యాచరణ రూపొందించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. 15 సంవత్సరాల పైబడిన యువజనులందరికీ ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ, బేసిక్ ఎడ్యుకేషన్, క్రిటికల్ స్కిల్స్, కంటిన్యూ ఎడ్యుకేషన్ అందించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. 2022 నుండి 2027 వరకు కనీసం 5 కోట్ల మందిని అక్షరాస్యులను చేయాలన్నదే ముఖ్య ఉద్దేశ్యం అని అన్నారు. వాలంటీర్లను లబ్దిదారులను ఎంపిక చేసి వాలంటీర్లు గా పాటశాల , కళాశాల విద్యార్థులు , గ్రామంలో చదువుకున్న యువతీ యువకులను ఎంపిక చేసుకుంటారని తెలిపారు. ఎంపికైన లబ్దిదారులకు అనుకూలమైన సమయంలో విద్యను అందిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. చదువుకోడానికి అవసరమైన బోధనా అభ్యాసన సామాగ్రి పూర్తిగా ఉచితంగా పంపిణి చేయబడుతుందని అన్నారు.

ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ఇందిర , సి.పి.ఓ లక్ష్మన్ , డి.పి.ఓ వెంకట్ రెడ్డి , అడల్ట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ అనిత , జిల్లా సెక్తోరియాల్ అధికారి హంపయ్య , ఎస్తేర్ రాణి , వివిధ మండల విద్యా శాఖ అధికారులు, తదితరుల పాల్గొన్నారు.

## కార్మికుడికి కంపెనీ నుండి బెనిఫిట్స్‌ను అందజేసిన సిఐటి నాయకులు రుద్ర కుమార్

**కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తాం: రుద్ర కుమార్**

**రాజేంద్రనగర్, జూలై6(నమస్తే ఉదయం):** కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు నిరంతరం కృషి చేస్తుందని నాయకుడు రుద్రకుమార్ అన్నారు. శనివారం కాటేదాన్ క్లస్టర్ పారిశ్రామిక ప్రాంతంలో బిస్కెట్ పరిశ్రమల్లో కొన్ని సంవత్సరాల కాలం నుండి డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సతీష్ కార్మికుడికి కుటుంబ పరిస్థితుల కారణంగా విధులు నిర్వహించలేకపోతున్నాడు. కంపెనీ నుండి రావాల్సిన బెనిఫిట్స్ కోసం యాజమాన్యంతో ఎంత ప్రయత్నించినా రాకపోవ టంతో సిఐటియును ఆశ్రయించాడు. కాటేదా క్లస్టర్ కన్వీన ర్ జాజాల రుద్ర కుమార్, కోశాధికారి భాస్కర్, పరిశ్రమ యాజమాన్యంతో సంప్రదించి కార్మికుడు సత్యంకు న్యాయం చేయాలని న్యాయపోరాటానికి సిద్ధమవుతే వెంటనే కంపెనీ యాజమాన్యం స్పందించి అతనికి రావలసినటువంటి గ్రాటివిటీ 30 వేల రూపాయలు అందజేసింది. కార్మి కులందరూ అనేక పరిశ్రమలలో ఇబ్బందికి గురై కార్మికులందరికీ తోడుగా ఉంటూ నిరంతరం తమ సమస్యల పైన పోరాడుతూ అంటి పెట్టుకొని ఉంటున్న సంఘం ఏకైక సంఘం సిఐటియు కార్మికులందరూ మీకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న వెంటనే సిఐటిని ఆశ్రయించి తమ న్యాయమైన కోరికలు పరిష్కారం కోసం అనేక పరిశ్రమలలో పనిచేసే కార్మికులందరూ ముందుకు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.





బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న దళిత నేత పచ్చ శ్రీనివాస్



పెంపుడు జంతువులకు యాంటీ రేబీస్ వ్యాక్సిన్‌ను వేస్తున్న డాక్టర్లు

### రాజేంద్రనగర్ వెటర్నరీ కాంప్లెక్స్‌లో

## యాంటీ రేబీస్ వ్యాక్సిన్ పంపిణీ

**రాజేంద్రనగర్, జూలై6(నమస్తే ఉదయం):** వరల్డ్ జోనోసిస్ దినోత్సవ సందర్భంగా శనివారం రాజేంద్రనగర్ లోని వెటర్నరీ కళాశాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న వెటర్నరీ కాంప్లెక్స్‌లో పెంపుడు జంతువులకు ఉచిత యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేసారు. ?

150 పెంపుడు జంతువులకు వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్స్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ డీన్ డాక్టర్ రఘునందన్, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఉదయ్ కుమార్, వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్స్ ప్రొఫెసర్ రామచంద్రారెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాంసింగ్ లకావత్, ప్రొఫెసర్ కే సి ఎస్ రెడ్డి, డాక్టర్ జై శ్రీ, డాక్టర్ గోపాలకృష్ణ, డాక్టర్ పావనిలు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమానికి స్పాన్సర్‌గా ఇండియన్ ఇమ్మనాలజికల్స్, మ్యాన్ క్రైండ్, విర్బాక్, పాప్స్, స్కై ఈసీ మొదలగు కంపెనీ వాళ్ళు జూనోసిస్ డేలో పల్గొన్నారు. వారితో పాటు టీచింగ్ నాన్ టీచింగ్ ఉద్యోగులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## మందకొడిగా పన్ను వసూళ్లు

**బకాయిలు రాబట్టడంలో నిర్లక్ష్యం**

**హైదరాబాద్,జూలై6(నమస్తే ఉదయం):** జంటనగరాల్లో ఇంటిపన్నుల వసూళ్లు మందగించాయి. గ్రామాలు, పట్టణాల్లో ఇంటిపన్ను వసూళ్లు మందకొడిగా సాగుతున్నాయి. పట్టణాలు విస్తరించడం, కొత్తగా మున్సిపాలిటీలు ఏర్పడ్డా ప్రజల ఆదాయవనరులు పెరగడం లేదు. దీంతో పట్టణాల్లో వ్యాపారాలు చితికి పోతున్నాయి. పురపాలికలు రోజురోజుకు విస్తరిస్తుండగా, ఆ మేరకు ఆదాయం రావడం లేదు. పట్టణం అభివృద్ధి చెందడంతో పాటు ఓవైపు మాల్స్, వ్యాపార సముదాయాలు, మరోవైపు ఇళ్ల నిర్మాణాలు పెరుగుతున్నాయి. కానీ ఆ స్థాయిలో ఆదాయం మాత్రం పెరగడం లేదు. మున్సిపాలిటీల పరిధిలోని దుకాణాల విషయంలో కొందరు అద్దె చెల్లిస్తుండగా, మరికొందరు పెండింగ్‌లో పెట్టడంతో మునిసిపల్ ఆదాయం దెబ్బతింటోంది.లీజుకు తీసుకున్న వారు పెద్ద మొత్తంలో సబ్ లీజుకు దుకాణాలను ఇచ్చుకుంటున్నారు. దీనివల్ల కూడా రావలసిన ఆదాయం రాకుండా పోతోంది. మునిసిపాలిటీకి పన్నుల వసూలు కూడా అంతంత మాత్రంగానే ఉంది. ఈ ఏడాది ఆస్తి పన్ను, దుకాణాల అద్దె, కొళాయిల పన్ను కలుపుకుని 50 శాతానికి మించి వసూలు కాలేదని సమాచారం. పన్ను వసూళ్ళలో నిర్లక్ష్యం వహించడం వంటి కారణాల వల్ల మునిసిపాలిటీకి రావాల్సిన మేర ఆదాయం రావడం లేదని తెలుస్తోంది. మాల్స్, వ్యాపార సముదాయాలు, ఇళ్ల నిర్మాణాలు విస్తరిస్తుండటంతో పట్టణం రోజురోజుకు పెరుగుతోంది. అయితే ఆ స్థాయిలో ఆదాయం మాత్రం రావడం లేదు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు సమకూర్చాలంటే పన్నుల రూపంలో ప్రజలు ఆదాయం చెల్లించాల్సి ఉంది.

### కాళేశ్వరం

## ఇంజనీర్లను విచారించనున్న కమిషన్

**హైదరాబాద్,జూలై6 (నమస్తే ఉదయం):** కాళేశ్వరం ప్రాజెక్టు పంప్ హౌస్ ఇంజినీర్లను జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారించనుంది. లక్ష్మి, సరస్వతి, పార్వతి పంప్‌హౌస్ ఇంజినీర్లను కమిషన్ ప్రశ్నించనుంది.

ఈ మూడు పంప్ హౌస్‌లకు చెందిన సీఈ నుంచి ఏఈఈల హోదాల్లో పనిచేసే ఇంజినీర్లు సోమవారం కమిషన్ ఎదుట హాజరు కానున్నారు. కాళేశ్వరానికి సంబంధించిన దస్త్రాలు ఇవ్వాలని ఇదివరకే ప్రభుత్వానికి కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. రెండు వారాల్లోగా అన్ని దస్త్రాలు అప్పగించాలని స్పష్టం చేసింది. విజిలెన్స్, ఎన్డీఎస్ఏ నుంచి తుది నివేదికలు కోరింది. పుణెలోని సీడబ్ల్యూపీఆర్‌కు తమ ప్రతినిధిని పంపించి కమిషన్ అధ్యయనం చేయించింది. నిపుణుల కమిటీ నుంచి కూడా పీసీ ఘోష్ కమిషన్ నివేదిక కోరింది. అఫిడవిట్ల పరిశీలన తర్వాత నోటీసులు జారీ చేయనుంది.


**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. “RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733